క్లుప్తంగా

చేసింది గోరంత..ప్రచారం కొండంత


మాట్లాడుతున్న ముువ్వల శ్రీనివాసరావు

బొబ్బిలి: రాష్ట్రంలోని టీడీపీ కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీల్లో గోరంత చేసి, కొండంత ప్రచారం చేసుకుంటోందని కాంగ్రెస్‌పార్టీ నియోజక వర్గ ఇన్‌చార్జి, జిల్లా అధికార ప్రతినిధి ముువ్వల శ్రీనివాసరావు విమర్శించారు. స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేసిన నవరత్నాలతో పాటు సూపర్‌సిక్స్ పథకాలను అదనం గా అమలు చేస్తామని ఎన్నికల సమయంలో చంద్రబాబు హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఈ హామీలేవి పూర్తిస్థాయిలో అమలు చేయకపోయిన ప్పటికీ చేసేశామంటూ కూటమి నాయకులు ప్రజలను నమ్మించే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. ఉత్తరాంధ్రను అభివృద్ధి చేసేందుకే కూటమికట్టామన్న టీడీపీ, జనసేన పార్టీలు విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ యత్నాలను ఎందుకు ఆపలేకపోతోందని ప్రశ్నించారు. అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేస్తామన్న హామీని నేటికీ నెరవేర్చలేదన్నారు. న్యాయవాదులకు రూ.10వేల స్టైఫండ్ ఇస్తామని చెప్పారని, ఇప్పుడు దాని ఊసే లేదన్నారు. కూటమి నాయకులు ఎక్కడికక్కడ ప్రభుత్వ భూములను కబ్జా చేస్తున్నారని ఆరోపించారు. వెంటనే హామీలను నెరవేర్చుకోవాలని డిమాండ్ చేశారు.

మార్కెట్ ఫీజు లక్ష్యం రూ.3.15 కోట్లు


మాట్లాడుతున్న స్పెషల్ గ్రేడ్ సెక్రటరీ కాళేశ్వరరావు

బొబ్బిలి: స్థానిక ఏఎంసీ పరిధిలో ఈ ఏడాది మార్కెట్ ఫీజు లక్ష్యం రూ.3.15 కోట్లు అని స్పెషల్ గ్రేడ్ సెక్రటరీ ఎం .కాళేశ్వరరావు తెలిపారు.ఇటీవలే బొబ్బిలి సెక్రటరీగా బాధ్యతలు స్వీకరించిన ఆయన బుధవారం సాక్షితో మాట్లాడు తూ ఇప్పటివరకూ రూ.38.35లక్షల మార్కెట్ ఫీజు వసూలు చేశామని, మార్చి వరకు సమయమున్నందున లక్ష్యం చేరుకుంటామన్నారు. స్థానికంగా రైతు బజార్ ఏర్పాటుకు ప్రభుత్వం స్థలమిస్తే నిర్మాణానికి ఏఎంసీ నిధులు వినియోగిస్తామన్నారు. ఏఎంసీ పరిధిలో ఉన్న టిక్కలివలస, రామభద్రపురం, బొబ్బిలి చెక్ పోస్టుల వద్ద కలెక్షన్లు బానే జరుగుతున్నాయని చెప్పారు.స్థానిక ఏఎంసీలో సెక్రటరీగా ఇప్పటివరకూ పనిచేసిన ఈశ్వర రావు గ్రేడ్-3 సెక్రటరీగా ఇక్కడే కొనసాగుతారని చెప్పారు. అలాగే సూపర్‌వైజర్‌గా సాలూరు నుంచి ఎం.శ్రీనివాసరావు ఇక్కడకు బదిలీపై రాగా ఇక్కడి నుంచి అరుణకు సాలూరు బదిలీ అయ్యిందన్నారు.

సచివాలయ సిబ్బందికి సన్మానం


గంగన్నపాడు సచివాలయంలో సిబ్బందిని సన్మానిస్తున్న ప్రజాప్రతినిధులు,పెద్దలు

తెర్లాం: మండలంలోని రంగప్పవలస, పణుకువలస, గంగన్నపాడు గ్రామ సచివాలయాల్లో పనిచేసి బదిలీ అయిన సిబ్బందికి ఆయా గ్రామాల సర్పంచ్‌లు ఆధ్వర్యంలో బుధవారం సన్మా నించారు. అయిదేళ్లపాటు వారు అందించిన సేవలను కొనియాడారు. సర్పంచ్‌లు శనపతి రాంబాబు, చందక సత్యనారాయణ, కోట సరోజిని, ఎంపీటీసీ సభ్యులు చేపేన సత్యనారాయణ, బెవర వెంకట శేషగిరి, కొప్పర శంకరరావు, తదితరులు పాల్గొన్నారు.

సాగునీరు అందక ఇబ్బందులు


చిన్నశిర్లాం వద్ద తోటపల్లి-16ఎల్ కాలువను పరిశీలిస్తున్న అచ్చెన్నాయుడు,జగన్‌మోహనరావు

రేగిడి: మండలంలోని పలు గ్రామాలకు తోటపల్లి ప్రాజెక్టు ద్వారా సాగునీరు అందక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వైస్ ఎంపీపీలు టంకాల అచ్చెన్నాయుడు, వావిలపల్లి జగన్‌మోహనరావు అన్నారు. చిన్నశిర్లాం గ్రామం వద్ద ఉన్న తోటపల్లి-16ఎల్ ఉప కాలువను బుధవారం పరిశీలించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కాలువలో తుప్పలు, పిచ్చిమొక్కలు, పూడిక పేరుకుపోయిందని, ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. రాజాం మెయిన్ కెనాల్ నుంచి 14-ఎల్, 16 -ఎల్, 17-ఎల్ మైనర్ కాలువల పరిధిలో 1,200 ఎకరాల సాగుభూమి ఉందని, ఇంత వరకు పట్టుమని పది ఎకరాల్లో కూడా దమ్ములు కాలేదన్నారు.వర్షాలు కురవకపోవడం,కాలువల్లో సాగునీరు రాకపోవడంతో నారు మడులు పూర్తిగా ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రైవేటు పాఠశాలల్లో తనిఖీలు

రాజాం: ప్రైవేటు కార్పొరేట్ పాఠశాలలు నిబంధనలు పాటించాలని ఎంఈఓ యాగాటి దుర్గారావు అన్నారు. పట్టణంలోని పలు ప్రైవేటు పాఠశాలల్లో బుధవారం ఆయన ఆకస్మిక తనిఖీలు చేశారు. ఆయా పాఠశాలల్లో విద్యార్థుల హాజరుశాతం, రికార్డుల నిర్వహణ, వసతుల కల్పన తదితర అంశాలను పరిశీలించారు. విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చేయడంతో పాటు వత్తిడి లేని విద్యను అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు.

నియంతలా పాలించకండి..

ఇది మీ జాగీరా..?


చైర్మన్ తీరును ప్రశ్నిస్తున్న వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు

- కమిషనర్ లేకుండా సమావేశం ఎందుకని ప్రశ్నించిన వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు
- నచ్చితే ఉండండి లేకపోతే పోండి అంటూ ఆవేశంతో ఊగిపోయిన మున్సిపల్ చైర్మన్ శరత్

బొబ్బిలి: ''మీరు నియంతనుకుంటున్నారా..? మీకు నచ్చినట్టు పరిపాలిస్తున్నారు. కనీస నియమ, నిబంధనలు కూడా పాటించకపోతే ఎలా, ఇదేనా పద్ధతి?. మున్సిపల్ కమిషనర్‌ను గత సమావేశంలోని అజెండాను అనుసరించి మేం కొన్ని సమస్యలను ప్రస్తావించాం. వాటికి ఈ సమావేశంలో సమాధానాలు ఇవ్వాల్సి ఉంది. ఇప్పుడేమో ఆమె లేకుండా సమావేశం నిర్వహిస్తు న్నారు.ఆమె లేకుండా సమస్యలపై మేం ఎవరినడగాలి?. కమిషనర్ లేని సమావేశంలో మేం సమస్య లు చెప్పుకునేందుకు ఎవరూ ఉండరుగా, మేం బయటికి వెళ్లిపోతున్నాం'' అని వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు ఇంటి గోవిందరావు, చోడిగంజి రమేష్‌నాయుడు, పాలవలస ఉమా శంకర్, గొలగాని రమాదేవిలు మున్సిపల్ సమావేశాన్ని బహిష్కరించారు. చైర్మన్ రాంబార్కి శరత్ అధ్యక్షతన బుధ వారం మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో నిర్వహించిన సాధారణ సమావేశం వాడీవేడిగా సాగింది. ముందుగా ఆర్ఐ పి.సురేష్ బాబు అజెండా కాపీని చదువుతుండగా కమిషనర్ లేకుండా సమావేశం ప్రారంభించారేటని 24వ వార్డు మల్లంపేట కౌన్సిలర్ ఇంటి గోవిందరావు ప్రశ్నించారు. దీనిపై ఆర్ఐ స్పందిస్తూ అధికారులు సెలవుపై వెళుతుంటా రని, ఇది సాధారణమని అన్నారు. వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు స్పందిస్తూ తాము కమిషనర్‌కు గత సమావేశంలో పలు సమస్యలను ఆమె దృష్టికి తీసుకువచ్చా మని, వాటికి వివరణ ఇవ్వాల్సింది ఆమేనని, ఆమె లేకుండా సమావేశం ఎందుకని,మరో రోజుకు వాయిదా వెయ్యొచ్చు కదా అని కోరారు. దీనిపై చైర్మన్ శరత్ ఆగ్రహంతో ఊగిపోతూ నచ్చితే ఉండండి లేదా వెళ్లిపోండి, ఏం చేస్తారో చేస్కోండనడంతో వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు, చైర్మన్ మధ్యవాగ్వాదం చోటు చేసుకుంది.


ఆగ్రహంతో ఊగిపోతున్న చైర్మన్ రాంబార్కి శరత్

సిబ్బందిని బెదిరిస్తున్నారు..

వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు ఉమాశంకర్ గోవిందరావు మాట్లాడుతూ మున్సిపల్ కార్యాలయం ప్రజలదని, ఇది ప్రజాప్రతినిధుల జాగీరు కాదని గుర్తురెగాలన్నారు. వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లతో మాట్లాడనీయకుండా మున్సిపల్ సిబ్బందిని బెదిరిస్తున్నారని, వారికి హెచ్చరికలు పంపుతున్నారని చైర్మన్‌ను ఉద్దేశించి అన్నారు. మున్సిపల్ సిబ్బంది, అధికారులకు కూడా కడుపుమండే రోజు వస్తుందని,ఆరోజు మీ రెడ్ బుక్ రాజ్యాంగంపై వారూ తిరగబడతారు తస్మాత్ జాగ్రత్త అని హెచ్చరించారు. దీనికి చైర్మన్ స్పందిస్తూ తామెప్పుడూ నియంతలా వ్యవహరించలేదని బదులిచ్చారు. వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు, ఒకటో వార్డు కౌన్సిలర్ చోడిగంజి రమేష్ నాయుడు మాట్లాడుతూ సమస్యలు లేవనెత్తిన కౌన్సిలర్లతో చర్చిద్దాం రండని చైర్మన్ సామరస్యంగా మాట్లాడాలే కాని, సభ్యులను ఉంటే ఉండండి పోతే పోండి,ఏం చేస్తారో చేసుకోండని అనడం సరైనదేనా అని ప్రశ్నించారు. కమిషనర్ లేకపోతే నచ్చినట్టు తీర్మానాలు ఆమోదించుకోవచ్చనే మొండి ధైర్యంతోనే చట్టాలను, రాజ్యాంగాన్ని పక్కన పెట్టి చైర్మన్ వ్యవహరిస్తున్నారని, కమిషనర్ వచ్చాకే తాము సమావేశానికి వస్తామని చెప్పి బాయ్‌కాట్ చేశారు. అనంతరం మరో అజెండా కాపీని కూడా చదివి అన్ని అంశాలనూ ఏకగ్రీవంగా టీడీపీ కౌన్సిలర్లు, పాలకపక్షం ఆమోదించారు డీఈఈ కిరణ్ కుమార్,ఏఈలు,సిబ్బంది పాల్గొన్నారు.

కూటమిది నయవంచక పాలన

- బాబు ష్యూరిటీ -మోసం గ్యారెంటీలో డాక్టర్ తలే రాజేష్

సంతకవిటి: ఎన్నికల హామీలు అమలు చేయకుండా కూటమి ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలను వంచిస్తోందని రాజాం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి డాక్టర్ తలే రాజేష్ ఆరోపించారు. మండలంలోని తలతంపర గ్రా మంలో బుధవారం 'బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ' కార్యక్రమం నిర్వహించారు. జెడ్పీ వైస్ చైర్మన్ సిరిపుర పు జగన్‌మోహన్ రావు, వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి రాజేష్ ఇంటింటికీ వెళ్లి ఎన్నికల హామీలు అమలు చేయకుండా టీడీపీ కూటమి ప్రభుత్వం చేస్తున్న మోసాలను ప్రజలకు వివరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడు తూ ప్రజల నమ్మకాన్ని దెబ్బతీసిన చంద్రబాబుకు మరో అవకాశం ఇవ్వకూడదన్నారు. వైఎస్సార్‌సీపీ జిల్లా కమిటీ సభ్యులు కనకల సన్యాసినాయుడు, స్థానిక నాయకులు సీహెచ్.వెంకటపతిరాజు, కె.సరస్వతిరావు, ఎస్.రంగరాయపురం సర్పంచ్ ఐ.జనార్దనరావు, రామరాయపురం మాజీ సర్పంచ్ వై.శ్రీనివాసరావు, పాల్గొన్నారు.


కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరిస్తున్న రాజేష్, జగన్‌మోహన్‌రావు

'మత్తు'కు బానిసలు కావొద్దు


తెర్లాం: పెరుమాళి మోడల్ స్కూల్‌లో విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న డీఎస్పీ భవ్య రెడ్డి


బాడంగి: అవగాహన కల్పిస్తున్న బొబ్బిలి రూరల్ సీఐ నారాయణరావు

తెర్లాం: విద్యార్థులు, యువత మత్తు పదార్థాలకు బానిసలుగా మారి జీవితాలను నాశనం చేసుకోవద్దని బొబ్బిలి డీఎస్పీ భవ్య రెడ్డి సూచించా రు. సంకల్పం కార్యక్రమంలో భాగంగా డ్రగ్స్‌తో కలిగి అనర్థాలు, వాటి నిషేదంపై మండలంలోని పెరుమాళి మోడల్ స్కూల్ తెర్లాం ఎస్ఐ సాగర్‌బాబు ఆధ్వర్యంలో బుధవారం అవగాహన కల్పించారు. ఈసందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ గ్రామాల్లో ఎవరైనా గంజాయి, డ్రగ్స్‌ను విక్రయించినా, వినియోగించినా వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు.విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచే లక్ష్యాలను నిర్దేశించుకుని వాటి సాధన కోసం శ్రద్ధగా చదువుకోవాలని చెప్పారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని, గ్రామీణ ప్రాంతాల ప్రజలకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించాలని సూచించారు. బాలికలు యుక్తవయస్సు వచ్చే వరకు వివాహం చేసుకోవద్దన్నారు. ట్రాఫిక్ నిబంధనలను వివరించా రు. ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు, ఎస్ఎంసీ చైర్మన్ పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

బాడంగి: విద్యార్థులు, యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని బొబ్బిలి రూరల్ సీఐ కె.నారాయ ణరావు సూచించారు. సంకల్పం కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలోని జూనియర్ కళాశాల, హైస్కూల్‌లో విద్యార్థులకు బుధవారం అవగాహన కల్పించారు. మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలను వివరిస్తూ రూపొందించన లఘు చిత్రాలను సంకల్పం వాహనంలోని ఎల్ఈడీ స్క్రీన్‌పై ప్రదర్శించారు. పోలీస్ సిబ్బంది, ప్రిన్సిపాల్ విజయకుమారి, ఇన్‌చార్జి హెచ్ఎం టి.వెంకటలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య నిర్వహణపై శ్రద్ధ

సంతకవిటి: గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని మండల ప్రత్యేకాధికారి, డ్వామా పీడీ శారదాదేవి మండల అధికారులకు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ కె.సురేష్‌కుమార్ అధ్యక్షతన బుధవారం సమీక్ష నిర్వహించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, తాగునీటి వనరులను ఎప్పటికప్పుడు క్లోరినేసన్ చేయించాలని సూచించారు. ఉపాధిహామీ వేతన దారులకు అధిక వేతనం వచ్చేలా చర్యలు తీసుకోవాలని, పారంపాండ్‌లు అధిక సంఖ్యలో నిర్మాణం అయ్యేలా చూడాలన్నారు.

స్మార్ట్‌మీటర్లు, సర్దుబాటు చార్జీలను రద్దు చేయాలి


బొబ్బిలి: మాట్లాడుతున్న ప్రజా సంఘాల నాయకులు


రామభద్రపురం:నిరసన తెలుపుతున్న వామపక్షాల నాయకులు

బొబ్బిలి: విద్యుత్ స్మార్ట్ మీటర్లను రద్దు చేసి, సర్దుబాటు చార్జీల దోపిడీని ఆపాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పొట్నూరు శంకరరావు కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.స్థానిక వేణుగోపాలస్వామి ఆలయ ప్రవచన మండపంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఐక్యవేదిక నాయకులు మాట్లాడారు. తాము అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలు పెంచబోమని, అవసరమైతే తగ్గిస్తామని చెప్పిన ముఖ్యమం త్రి చంద్రబాబునాయుడు నేడు విద్యుత్ చార్జీలను అమాంతం పెంచేశారని మండిపడ్డారు. స్మార్ట్ మీటర్ల పేరుతో ప్రజలను దోపిడీ చేసేందుకు ప్రభుత్వాలు పూనుకున్నాయన్నారు. రాష్ట్రంలోని గృహాలకు స్మార్ట్ మీటర్లను అమర్చడం మీటర్ మార్పు కాదని, విద్యుత్ పంపిణీ ప్రైవేటీకరణకు కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టేందుకేనని చెప్పారు. స్మార్ట్ మీటర్లకు, సర్దుబాటు చార్జీలకు వ్యతిరేకంగా ఆగస్టు 5న ఉదయం పది గంటలకు ఈపీడీసీఎల్ కార్యాలయం వద్ద చేపట్టనున్న నిరసన కార్యక్రమానికి ప్రజలంతా హాజరై జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా డిప్యూటీ సెక్రటరీ మునకాల శ్రీనివాసరావు, ఇఫ్టూ నాయకులు పి.లక్ష్మణరావు, రైతు సంక్షేమ సంఘం అధ్యక్షుడు వేమిరెడ్డి లక్ష్మునాయుడు, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్ .గోపాలం, ఐద్వా జిల్లా అధ్యక్షురాలు కె.పుణ్యవతి,మున్సిపల్ కార్మిక సంఘం నా యకుడు యుగంధర్ పాల్గొన్నారు.

నిరసన

రామభద్రపురం: స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేస్తే వాటిని పగలగొట్టాలని చంద్రబాబునాయుడు, ఆయన తనయుడు లోకేష్ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు చెప్పారని, అధికారంలోకి వచ్చిన తర్వాత నేడు అవే స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేస్తుండడమేంటని సీపీఐ జిల్లా నాయకుడు అలమండ ఆనంద రావు,సీపీఎం నాయకుడు బలస శ్రీనివాసరావు ప్రశ్నించారు. స్మార్ట్ మీటర్ల ఏర్పాటును వ్యతిరేకిస్తూ స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద వామపక్షాల నాయకులు బుధవారం నిరసన తెలిపారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్మార్ట్ మీటర్లు రద్దు చేసి సర్దుబాటు చార్జీల దోపిడీ ఆపాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు లెంక ఎర్రంనాయుడు,చిన్నంనాయుడు,అచ్చెంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

మానవ అక్రమ రవాణా అరికట్టాలి


మాట్లాడుతున్న జడ్జి హేమస్రవంతి జానకీరామ్

బొబ్బిలి: మానవ అక్రమ రవాణా నేరమని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్‌జడ్జి హేమస్రవంతి జానకీరామ్ అన్నారు. స్థానిక సీనియర్ సివిల్ జడ్జి కోర్టు ఆవరణలోమానవ అక్రమరవాణా నివారణపై ప్రజలకు బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ మానవ అక్రమ రవాణా జరిగిన వారిని గుర్తించేందుకు, వారికి ఆశ్రయమిచ్చి ఆదుకునేందుకు ఎన్‌జీఓలు, ప్రభుత్వం కలిసి పనిచేయాలన్నారు. అక్రమ రవాణా అనేది వివిధ రూపాల్లో ఉంటుందని, దీని పరిణామాలను కూడా గుర్తించా లన్నారు. బాధితులకు సహాయం అందజేసి అక్రమ రవాణా నిరోధానికి ప్రజలను కూడా చైతన్యం చేయాలన్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్ష, ఉపాధ్యక్షులు ఎం .ఆనందరావు, రుంకాన ప్రసాదరావు, పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

మాతా,శిశు ఆరోగ్య సంరక్షణే ధ్యేయం


గర్భిణులకు పౌష్టికాహారం అందజేస్తున్న రోటరీ క్లబ్ కార్యవర్గం, యూహెచ్‌సీ, అధికారులు

బొబ్బిలి: మాతా శిశు ఆరోగ్యం,వారి సంరక్షణే ధ్యేయంగా పనిచేస్తామని రోటరీక్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు వి.శ్రీహరి,శివకాంత్ చెప్పారు.పట్టణంలోని మూడో వార్డు సంఘం వీధిలో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీఓ జె.విజయలక్ష్మి చేతుల మీదుగా వంద మంది గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ చేశారు. రోటరీ జిల్లా చైర్మన్ జె.సి.రాజు, యూహెచ్‌సీ వైద్యుడు డాక్టర్ వెంకట్,మున్సిపల్ ఫ్లోర్ లీడర్ గెంబలి శ్రీనివాస రావు, మాజీ అధ్యక్షుడు సింద్రీ శ్రీనివాసన్, సభ్యులు అప్పలరాజు,రామకృష్ణ,జయప్రకాష్, నితీష్, కౌన్సిలర్ బొత్స సురేష్,అంగన్‌వాడీ,ఆశ కార్యకర్తలు,యూహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

అప్రమత్తతతోనే ప్రమాదాల నివారణ

రాజాం సిటీ: అప్రమత్తతతోనే అగ్నిప్రమాదాలను నివారించవచ్చని అగ్నిమాపక శాఖ ఎస్ఐ పి.అశోక్ అన్నారు. అగ్ని ప్రమాదాల నివారణపై పట్టణంలోని అమృత ఆస్పత్రి, సురేష్ మల్టీస్పెషాలిటీ ఆస్పత్రిలో సిబ్బందికి బుధవారం అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రమాదాలు సంభ వించే సమయంలో ఆందోళన చెందకుండా ఫైర్‌సేఫ్టీ పరికాలు ఉపయోగించి మంటలు అదుపుచేసేందుకు ప్రయత్నించాలన్నారు. సురక్షితంగా బయటపడేందుకు అత్యవసర మార్గాలను ఉపయోగించుకోవాలనిఅనంతరం మాక్‌డ్రిల్ నిర్వహించారు.

ఎస్పీ ఔదార్యం

రేగిడి: పార్వతీపురం మన్యం జిల్లా ఎస్పీ మాధవరెడ్డి తన ఔదార్యాన్ని చాటుకున్నారు. మండలంలోని వావిలవలసలో ఉన్న రాహుల్ సౌరబ్ నిత్యాన్నదాన సత్రంలో ఉంటు న్న అనాథలకు ఒడిశా రాష్ట్రంలోని రాయఘడ మజ్జిగౌరమ్మతల్లి దర్శనానికి వెళ్లేందుకు అవసరమైన సహాయ సహకారాలు ఎస్పీ అందించారని సత్రం నిర్వాహకులు, సామాజిక కార్యకర్త పాలూరి సిద్దార్థ బుధవారంతెలిపారు. ఆశ్రమంలోని అనాథలకు రాయఘడ పర్యటనలో అయ్యే భోజనాలు, ఇతర ఖర్చులకు ఆర్థిక సహాయం, దుస్తులు అందజేశారని చెప్పారు. ఎస్పీకి సత్రం నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు.

దాడితల్లీ క్షమించు..!



ఉత్తరాంధ్ర భక్తుల ఇలవేలుపు అయిన బొబ్బిలి దాడితల్లి అమ్మవారి ఆలయ పరిసరాలను చెత్తమయం చేస్తున్నారు. చెత్తను ఎక్కడపడితే అక్కడ పారబోయవద్దని, ఇళ్ల వద్దకు వచ్చే పారిశుద్ధ్య కార్మికులకు అందించాలని మున్సిపల్ కమిషనర్, శానిటరీ అధికారులు ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ప్పటికీ ఫలితం లేకుండా పోతోంది. ఇళ్ల మధ్యే కాదు, చివరికి ఇలా బైపాస్ రహదారిలోని దాడితల్లి అమ్మవారి ఆలయం చుట్టూ ఇష్టారీతిగా చెత్త పార బోస్తున్నారు. చెత్త కుళ్లిపోయి దుర్వాసన వస్తోందని, ఆలయ పరిసరాల్లో ఉండలేకపోతున్నామని భక్తులు, పురోహితులు వాపోతున్నారు. అంతేకాదు ఇక్కడ బహిరంగ మలవిసర్జన కూడా చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మున్సిపల్ అధికారులు, సిబ్బంది చొరవ తీసుకుని ఆలయ పరిసరాల్లో చెత్తపారబోయకుండా చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు. – బొబ్బిలి

ప్రారంభించేదెప్పుడో..?



ఈ చిత్రంలో కనిపిస్తున్నది బూసాయవలస కస్తుర్బా గాంధీ బాలికల విద్యాలయం(కేజీబీవీ)లో ఇంటర్మీడియట్ విద్యార్థినుల కోసం గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మంజూరైన ఎస్ఎస్ఏ నిధులు రూ.1.60 కోట్లతో నిర్మించిన భవనం. 11 గదులతో ఈ భవన నిర్మాణం పూర్తయ్యి ఏడాది కావస్తున్నా ఇంకా ప్రారంభానికి నోచు కోలేదు.ఫలితంగా విద్యార్థినులు ఇరుకుగదుల్లో చదువులు సాగించాల్సి వస్తోంది. భవనాన్ని త్వరగా ప్రారంభించాలని ప్రతీ ఆదివారంతో పాటు సెలవు రోజుల్లో తమ పిల్లలను చూడడానికి వచ్చే తల్లిదండ్రులు కోరుతున్నారు. – రామభద్రపురం

చినుకుపడితే అంతే..



రాజాం పట్టణంలో ఎల్ఐసీ కార్యాలయం పరిధిలోని వార్డుల్లో సీసీ రోడ్లపై వర్షపు నీరు నిలిచిపోతుండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.ఈ ప్రాంతంలో మురుగుకాలువలు లేకపోవడంతో వర్షపు నీరు రోడ్లపై నిలిచిపోతోందని, అధికారులు స్పందించి కాలువలు నిర్మించాలని ఇక్కడి ప్రజలు కోరుతున్నారు. – రాజాం

ఇద్దరూ మోసగాళ్లే..


కూటమి ప్రభుత్వ మోసాలను మహిళలకు వివరిస్తున్న శంబంగి, తదితరులు

- 'బాబు ష్యూరిటీ- మోసం గ్యారెంటీ'లో మాజీ ఎమ్మెల్యే శంబంగి

బొబ్బిలి: సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఇద్దరికిద్దరూ మోసగాళ్లేనని మాజీ ఎమ్మెల్యే, బొబ్బిలి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త శంబంగి వెంకట చినఅప్పలనాయుడు ఆరోపించారు. బొబ్బిలి పట్టణంలోని 10వ వార్డు గొల్లపల్లిలో బుధవారం సాయంత్రం 'బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ' కార్యక్రమం నిర్వహించారు. శంబంగితో పాటు వైఎస్సార్‌సీపీ శ్రేణులు ఇంటింటికీ వెళ్లి మహిళలు, యువత, వృద్ధులను కలిసి కూటమి ప్రభుత్వం చేస్తున్న మోసాలను కళ్లకు కట్టినట్టు వివరించారు. శంబంగి మాట్లాడుతూ సూపర్‌సిక్స్, ఇతర హామీలను అమలు చేయకుండా రాష్ట్ర ప్రజలను చంద్రబాబు మోసం చేస్తున్నారని అన్నారు. చంద్రబాబు ఇచ్చిన హామీలకు నాది బాధ్యత అన్న పవన్‌కల్యాణ్ ఇప్పుడు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. ఇద్దరూ కలిసి ప్రజలను మోసం చేశారని విమర్శించారు. మహిళలకు ప్రతి నెలా రూ.1500, నిరుద్యోగులకు నెలకు రూ.3000 భృతి ఇస్తామని చెప్పారని, ఆ పథకాలను ఎప్పటి నుంచి అమలు చేస్తారో ఆడబిడ్డలు, నిరుద్యోగ యువతకు చంద్రబాబు, పవన్ కల్యాణ్ సమాధానం చెప్పాలన్నారు. ప్రజలకిచ్చిన హామీలనే కాకుండా ఉద్యోగులకు ఇస్తామన్న పీఆర్సీని కూడా చంద్రబాబు అమలు చేయడం లేదని, ఇంతకంటే మోసకారి మానవుడుండడని ఎద్దేవా చేశారు. మాజీ మున్సిపల్ చైర్మన్‌లు ఇంటి గోపాలరావు, ఎస్.వి. మురళీకృష్ణారావు, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు చోడిగంజి రమేష్ నాయుడు, సీనియర్ నాయకులు తూముల భాస్కరరావు, వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాల జిల్లా కార్యదర్శి శంబంగి వేణుగోపాల నాయుడు, స్థానిక నాయకులు తుట్ట తిరుపతి,పలువురు కౌన్సిలర్లు, వార్డు ఇన్‌చార్జ్‌లు పాల్గొన్నారు.

ఇలా అయితే ఎలా తింటారు..?


బీసీ బాలుర వసతి గృహంలో హాట్ పొంగలిని రుచిచూస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

బాడంగి: వంటకాలు నాణ్యంగా, రుచికరంగా లేకపోతే విద్యార్థులు ఎలా తింటారని వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం నాయకులు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర విద్యార్థి విభాగం అధ్యక్షుడి పిలుపు మేరకు ఆపార్టీ బొబ్బిలి నియోజకవర్గ విద్యార్థి విభాగం అధ్యక్షుడు తెంటు తిరుపతిరావు ఆధ్వర్యంలో విద్యార్థి విభాగం నాయకులు హాస్టళ్ల బాట పట్టారు. మండలకేంద్రంలోని బీసీ, ఎస్సీ బాలుర వసతి గృహాలను బుధవారం ఉదయం సందర్శించారు. పిల్లలకు ఉదయం టిఫిన్‌గా అందించిన హాట్ పొంగలి వంటకాన్ని రుచి చూశారు. వంటకం రుచికరంగా లేదని, ఇలా అయితే పిల్లలు ఎలా తింటారని అక్కడి సిబ్బందిని తిరుపతిరావు, తదితరులు నిలదీశారు. అలాగే పిల్లల రీడింగ్ రూమ్‌లు, డార్మెటరీని పరిశీలించారు. తిరుపతిరావు మాట్లాడుతూ వసతి గృహాల్లో పిల్లలకు బెడ్లు లేక నేలపైనే పడుకొంటున్నారని, వసతి గృహాలు అసౌకర్యాలకు నిలయాలుగా మారాయని అన్నారు. ఎస్సీ హాస్టల్ భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో శ్లాబ్ నుంచి వర్షం నీరు కారుతోందని, పిల్లలు చదువుకునేందుకు, నిద్రపోయేందుకు అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.బాత్‌రూమ్‌లకు తలుపులు లేవని, హాస్టళ్లుసమస్యలకు నిలయాలుగా మారాయని ఆరోపించారు.వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు బేతనపల్లి శంకరరావు, జెడ్పీటీసీ పెద్దింటి రామారావు, మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు యామలశివప్రసాద్, ప్రధానకార్యదర్శి తెర్లి శ్రీనువాసరావు,రాజశేఖర్ తదితరులు ఉన్నారు.